నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 12 : బాలాజీ నగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో లైన్ మరమ్మతు పనుల కారణంగా విద్యు త్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ భీమ లింగప్ప ఓ ప్రకటనలో తెలిపారు. నేడు (గురువారం) ఉద యం 10:30 నుంచి సాయంత్రం 3 గం టల వరకు సఫ్దర్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, జీవన్ హైట్స్ అపార్ట్‌మెంట్, కేపీహెచ్‌బీ కాలనీ 7వ పేజ్‌పరిసరాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కుత్బుల్లాపూర్ : వేసవి కార్యాచరణ ప్ర ణాళిక పనుల కోసం మరమ్మతులు చే సేందుకు నేడు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేట్ బషీరాబాద్ సబ్‌స్టేషన్ ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈ మేరకు ఉ దయం 11 నుంచి మధ్యాహ్నం 2 గం టల వరకు11 KV జీడిమెట్ల ఫీడర్ పరిధిలోని.. జీడిమెట్ల గ్రామం, భీమా ప్లైడ్, గ్రీన్ పార్క్, HDFC బ్యాంక్ లైన్, పిస్తా హౌస్ ఏరియా, మెడోన్ హాస్పిటల్స్, 11 KV మీనాక్షి ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో గ్రీన్ పార్క్, మీనాక్షి కాలనీ, స్ప్రింగ్ ఫీల్డ్ కా లనీ, సత్యం వైన్స్ ఏరియా, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 KV గాయత్రి నగర్ పరిధిలో గాయత్రి నగర్ మొత్తం ప్రాంతం, గోదావరి హోమ్స్ ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

మాదాపూర్, ఫిబ్రవరి 12 : ఫీడర్ మరమ్మతుల కారణంగా అల్లాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కె.వి. హ్యుందాయ్ ఫీడర్ పరిధిలోని మెరిడియన్ స్కూల్ సమీపంలో, ఎస్ కన్వెన్షన్ లేన్, బుట్ట కన్వెన్షన్ రోడ్ సమీపంలో, ఎన్ఐఏ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాకేశ్ గౌడ్ తెలిపారు.

చందానగర్ పరిధిలో ..

నూతన ఫీడర్ల ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చందానగర్ ట్రాన్స్‌కో ఏఈ దీప్తి తెలిపారు. 11 కె.వి. మార్తాండ నగర్ ఫీడర్ పరిధిలోని మార్తాండ నగర్, న్యూ హఫీజ్‌పేట్, హనీఫ్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తును నిలిపివేయగా, 11 కె.వి. ప్రేమనగర్ ఫీడర్ పరిధిలోని న్యూ హఫీజ్‌పేట్, ప్రేమనగర్ ఏరియా అంతట, ప్రేమనగర్ బీ – బ్లాక్ ప్రాంతాల్లో ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు, 11 కె.వి. హనుమాన్ టెంపుల్ ఫీడర్ పరిధిలోని మదీనాగూడ, మైత్రి నగర్, మదినగూడ విలేజ్ వంటి ప్రాంతాల్లో ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కూకట్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్షా కిట్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 12 : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతంగా ఎదగాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు.బుధవారం కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్షత్రియ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎగ్జామ్ కిట్ (జామెట్రీ బాక్స్, పెన్స్, ఎగ్జామ్ ప్యాడ్స్)ను ఎమ్మెల్యే విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యార్థులకు చేయూతనందించేందుకు సొంత ఖర్చులతో ప్రతి ఏటా.. స్కూల్ బ్యాగ్‌లు లు, నోట్ బుక్స్, పెన్నులు పెన్సిల్ లతో కూడిన కిట్టును అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ ను అందించిన ఫెడరేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ బీఆర్ఎస్ నాయకులు శ్యామలరాజు, సుధీర్, రామకృష్ణంరాజు, సంతోష్, ప్రభాకర్, ఉపాధ్యాయులు ఉన్నారు

ఆధ్యాత్మికతో..సమన్వయ భావాలు

దుండిగల్ : ఆధ్యాత్మిక కార్యక్రమాలతోనే ప్రజల్లో శాంతి సామరస్యం నెలకొంటుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. గాజుల రామారం సర్కిల్ సూరారం డివిజన్ నల్లగుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం నియోజక వర్గ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సో మేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 24వ ద్వాదశ జ్యోతిర్లింగాల శివ పూజ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. శివ స్వాములతో కలిసి పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల్లో సామాజిక సమగ్రతను పెంపొందించాలంటే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వివిధ డివిజన్ల అధ్యక్షులు రుద్ర అశోక్ , పోలే శ్రీకాంత్, ఏర్వ శంకరయ్య, నాయకులు వేణు యాదవ్, ఫిరోజ్ తోపాటు శివ స్వాముల పాల్గొన్నారు.

– గాజులరామారం డివిజన్, ఇంద్ర నగర్ –ఏ లోని పోచమ్మ ఆలయం 9 వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొని అమ్మవారికి పూజలు

ద్వాదశ జ్యోతిర్లింగ శివ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

చేశారు. ఆయన మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఆలయాల పాత్ర ముఖ్యమైనదన్నారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

డిజిటల్ బోర్డు వినియోగించాలి

అధ్యాపకులకు సూచిస్తున్న డీఈవో విజయకుమారి

బాలానగర్ : ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ బోర్డ్ వినియోగించాలని మేడ్చల్ విద్యాశాఖ అధికారి(డీఈవో) విజయకుమారి పేర్కొన్నారు. బుధవారం జడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతున్న ట్రైనింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ.. పాఠశాలల్లో డిజిటల్ బోధనతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. డిజిటల్ బోర్డు ద్వారా విద్యార్థులకు అభ్యాసన స్థాయిని పెంచే విధంగా కృషి చేయాలన్నారు. శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్ట్‌లో డిజిటల్ బోర్డు వినియోగంపై నైపుణ్యాలు పెంపొందించుకొని తరగతి గదిలో ప్రతి రోజు లాగిన్ అయి బోధించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణ్ జ్యోతి ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈపీటీఆర్ఐ ని ప్రక్షాళన చేయాలి

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 12 : గచ్చిబౌలిలోని ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ రీచార్జ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఈపీటీఆర్ఐ)ను ప్రక్షాళన చేయాలని కోరుతూ రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదయ శాఖమంత్రి కొండ సురేఖకు... జే ఎన్ టీ యూ హెచ్ జేఏసీ విద్యార్థి సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. తెలంగాణకు చెందిన ఈ సంస్థలో ఇప్పటికీ ఆంధ్రా ఉద్యోగుల ఆధిపత్యం కొనసాగుతుందని తెలిపారు. సంస్థ పై దృష్టి సారించి ప్రక్షాళన చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ జేఏసీ చైర్మన్ బొట్ల బిక్షపతి సలహాదారులు రాజన్న, శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు సుకుమార్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

పెండింగ్ పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో దశలవారీగా పూర్తి చేసేందుకు కృషిచేస్తానని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు.బుధవారం డివిజన్ పరిధిలోని సర్దార్ నగర్ లో జరుగుతన్న సీసీరోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.... సిసి రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్కు సూచించారు.కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

- అల్లాపూర్

మార్చి 2న ..గచ్చిబౌలిలో డెసిబుల్ డాష్ రన్

గచ్చిబౌలి స్టేడియంలో మార్చి 2న నిర్వహించే రన్ ఫర్ డెసిబుల్ డాష్ – 2025 గోడపత్రికను సినీ నటుడు శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, మైక్రో కేర్ ఈఎన్‌టీ వైద్యశాల, మౌర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5 కే రన్ పోటీలను నిర్వహిస్తున్నారు. వినికిడి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

- కేపీహెచ్‌బీ కాలనీ

డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 12: నిషేధిత డ్రగ్స్‌ను తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన రాకేశ్ కుమార్, సురేశ్‌కుమార్ కొన్నేండ్ల కింద నగరానికి వలస వచ్చి సుభాష్ నగర్ డివిజన్ భాగ్యలక్ష్మి కాలనీ ఉంటూ జీడిమెట్ల పైపులైన్ రోడ్డు మార్గంలో టైల్స్ లో పని చేసుకుంటున్నారు. కొన్ని రోజులుగా నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్ ను రాజస్థాన్ నుంచి దిగుమతి చేసుకొని స్థానికంగా వాటిని అవసరమైన వారికి అందిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. మంగళవారం రాత్రి 32 గ్రాములు ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకొని వెళ్తుండగా పేట్ బషీరాబాద్ యాదిరెడ్డి బండాకు వెళ్లే మార్గంలో కట్ట మైసమ్మ టెంపుల్ సమీపంలో సయ్యద్ నగర్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి మూడు మొబైల్ ఫోన్లు, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని వారిని తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బాలానగర్, ఫిబ్రవరి 12 : కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఫుట్‌పాత్ ఆక్రమణలను జీహెచ్ఎంసీ బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. బుధవారం ఫిరోజ్‌గూడలో రోడ్డు కిరువైపులా ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగించేశారు. బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేశ్, ఇతర సిబ్బంది, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిపై ఆక్రమణల తొలగింపు

ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

మియాపూర్ ఫిబ్రవరి 12: చందానగర్ సర్కిల్ పరిధిలోని జాతీయ రహదారికి ఇరువైపుల ఆక్రమణలను అధికారులు బుధవారం ఉదయం తొలగించారు. మరో వారం రోజుల పాటు ఆక్రమణ తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ కొనసాగించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసు విభాగాల బందోబస్తుతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. త్వరలో లింగంపల్లి చౌరస్తాలో నిర్మించిన ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం కానున్న నేపథ్యంలో రహదారి ఆక్రమణ తొలగింపును అధికారులు ఆరంభించారు. రహదారికి ఇరువైపులా ఉన్న ఈ ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్కు అంతరాయం లేకుండా చేయనున్నారు. సర్కిల్ పరిధిలోని మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు ఆక్రమణల తొలగింపు వారం రోజుల పాటు కొనసాగించనున్నట్లు చందానగర్ డీసీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణం సీజ్ ..

కేపీహెచ్‌బీ కాలనీ : జీహెచ్ఎంసీ నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు ఉంటాయని మూసాపేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ మెహర హెచ్చరించారు. బుధవారం సర్కిల్ పరిధిలోని మోతీ నగర్ లో ప్లాట్ నం. 33 లో నిబంధనలు అతిక్రమించి నిర్మిస్తున్న భవనాన్ని సీజ్ చేశారు. నిర్మాణదారులు నిబంధనలు పాటిస్తూ భవనాలను నిర్మించాలని కోరారు. సర్కిల్ పరిధిలో ఆయా ప్రాంతాల్లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను గుర్తించామని వాటిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు.

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో గోదావరి జలాలు 15 రోజులుగా వృథాగా రోడ్డు పాలవుతున్నాయి. ఎన్‌హెచ్ 44 పక్కన సర్వీస్ రోడ్డులో.. టాటా షోరూం సమీపంలో నీటి వృథా విషయంలో అధికారులు స్పందించక పోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జలమండలి అధికారులు పనులు పూర్తి చేసి వృథాను అ రికట్టాలని కోరుతున్నారు. - కుత్బుల్లాపూర్

నీటి లీకేజీని నివారించండి

మియాపూర్ : తాగునీటి లీకేజీ సమస్యను నివారించాలని హైదర్ నగర్ కార్పొరేటర్ నార్ని శ్రీనివాసరావు సూచించారు. దెబ్బతిన్న రోడ్డును పునరుద్ధరించాలని ఆదేశించారు. ప్రగతి నగర్ రోడ్లో ప్రసాద్ హాస్పిటల్ సమీపంలో తాగునీటి పైపు లీకేజీ, దెబ్బతిన్న రోడ్డు ప్రాంతాన్ని అధికారులతో కలిసి కార్పొరేటర్ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో గుంతల రోడ్డుతో వాహనదారులు అవస్థలు పడుతున్నారని చర్యలతో తక్షణ ఉపశమనం కలిగించాలన్నారు. కార్యక్రమంలో జల మండలి జీహెచ్ఎంసీ అధికారులు కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్కల్ప్చర్ ఎగ్జిబిషన్

ప్రదర్శనలో ఉంచిన స్కల్పచర్‌లను తిలకిస్తున్న దృశ్యం

ప్రదర్శనలో ఉంచిన స్కల్పర్లు

కొండాపూర్, ఫిబ్రవరి 12 : సంస్కృతి, సంప్రదాయాలు, సున్నితత్వం, కఠినత్వాల కలయికను ప్రతిబింబించేలా రూపొందించిన స్కల్ప్చర్లతో పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ విద్యార్థి మధుబాబు మంగళగిరి మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సోలో స్కల్పచర్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రదర్శనకు ఆర్టిస్ట్, క్యూరేటర్ అన్న పూర్ణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన శిల్పాలను కళాకారులతో కలిసి తిలకించారు. సంస్కృతి, సంప్రదాయాలతో పాటు మహిళలు, పురుషుల మధ్య మనోభావాలను భావపరిచేలా రూపొందించిన శిల్పాలు అద్భుతంగా ఉన్నాయంటూ పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో 17 శిల్పాలను ఈ నెల 18 వరకు ప్రదర్శించనున్నట్లు నిర్వహకులు తెలిపారు.

శిల్పాల ప్రత్యేకతను వివరించిన కళాకారుడు మధుబాబు..

నాగలి.. వ్యవసాయ రంగంలో నాగలి గొప్పదనాన్ని నేటి తరాలకు తెలిసేలా రూపొందించిన శిల్పం అద్భుతంగా ఉన్నది. ప్రస్తుతం ఆధునిక యంత్రాల సహాయంతో వ్యవసాయం కొనసాగిస్తుండడంతో నాగలి కనుమరుగయ్యే అవకాశం ఉన్నది. శిల్పం ద్వారా కొద్దిమందికైనా నాగలి గురించి తెలియజేయాలని రూపొందించాను.

దేవాలయాలు... మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని, పాశ్చత్య సంస్కృతి వలలో పడకుండా మనం మన ఉనికిని కాపాడుకునేలా తెలియజేసేందుకు దేవాలయ శిల్పం రూపొందించాను.

కఠినత్వం, సున్నితత్వం... రాతి – చెక్క, రాతి – ఇత్తడిల కలయికతో తయారు చేసిన శిల్పాలు కఠినత్వం, సున్నితత్వాలను తెలియజేస్తాయని. వీటి ద్వారా మహిళలు, పురుషుల మనస్తత్వాలను తెలియజేస్తాయన్నారు.

ముఖాలు... మనుషులు విభిన్న పరిస్థితులలో భావపరిచే మనోభావాలను తెలియజేసేలా ముఖాల ఆకృతులను రూపొందించాను. పరిస్థితులకు తగ్గట్లుగా మనుషుల ముఖ భావాలను వ్యక్తపరుస్తారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 12 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్ లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ – రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 13, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 28, బజ్జి మిర్చి 18, కాకర 32, బీరకాయ 40, క్యాబేజీ 10, ఫ్రెంచ్ బీన్స్ 40, క్యారెట్ 19, కాలీ ఫ్లవర్ 18, దొండ 35, చిక్కుడు 35, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 19, క్యాప్సికం 35, ఆలుగడ్డ 23, కీరా 18, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ (1) 18, కందగడ్డ 60, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 29, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 45, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 23, గుమ్మడికాయ 13, నిమ్మకాయలు(12) 20 నుంచి 30, మునగకాయ(1) 8 నుంచి 10, పచ్చి బఠానీ 28, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 200, అల్లం 80, వెల్లుల్లి 200, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9:30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

మియాపూర్ ,ఫిబ్రవరి 12: బల్దియా మేయర్ విజయలక్ష్మిని స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు , మియాపూ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ బుధవారం కలిశారు. డివిజన్ సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ తోడ్పాటు అందించాలని కోరారు. డ్రైనేజీ, తాగునీటి విస్తరణ , వీధి దీపాల ఏర్పాటు సౌకర్యవంతమైన రహదారుల నిర్మాణం పరంగా సహకరించాలని కోరారు .

బాధితులకు అండగా..

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 12 : పారిశ్రామిక వాడలో పనిచేసే కార్మికులకు అన్యాయం జరిగితే వారి పక్షాన ఉండి న్యాయం కోసం పోరాడుతానని బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి సింగ్ అన్నారు. పటాన్ చెరువు పారిశ్రామిక వాడలోని ధనలక్ష్మి ట్రాన్స్ పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ రెడ్ మిక్స్ కంపెనీలో బిహారీ చెందిన ఉదయ్, అశిష్ డ్రైవర్లుగా పని చేసి మానేశారు. వారికి సంబంధించిన వేతనం ఇవ్వకుండా కంపెనీ యజమాని నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బాధిత డ్రైవర్లు కార్మిక సంఘం నాయకుడు రవి సింగ్ ను ఆశ్రయించారు. వెంటనే యజమానితో మాట్లాడి ఇద్దరు డ్రైవర్లకు రావలసిన రెండు లక్షల జీతం డబ్బులను ఇప్పించాడు. దీంతో బాధితులు కార్మిక సంఘం నాయకుడికి కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ ఉన్నారు.

గచ్చిబౌలిలోని ఒమేగా దవాఖానలో నూతనంగా ప్రారంభించిన లాంజ్విటీ లాంజ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న దవాఖాన వ్యవస్థాపకుడు డాక్టర్ మోహన వంశీ – కొండాపూర్

నిధులు సమకూర్చి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలి

దుండిగల్, ఫిబ్రవరి 12 : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, జర్నలిస్టు కాలనీ సమీపంలోని సర్వే నం. 334 ప్రభుత్వ భూమిలో కాలనీ ప్రజల అవసరార్థం కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడంతో పాటు అందుకు నిధులను సైతం మంజూరు చేయాలని నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీ ని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. జర్నెస్ కాలనీ సమీపంలోని సర్వే నం. 334 లో కొంతకాలంగా వినాయక, దేవీశరన్నవరాత్రి, దసరా ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అయితే కాలనీ వాసులకు కమ్యూనిటీ హాలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయమై ఇప్పటికే మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద కలిసి విజ్ఞప్తి చేయగా వారు సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేంద్ర చారి, ఉపాధ్యక్షులు దేవేందర్ గుప్తా, సలహాదారులు తెలుపుల సుధాకర్ రెడ్డి, మేకల జీతయ్యా, సత్యనారాయణ, రమేశ్, పితాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కమిషనర్ సాబేర్‌ఆలీకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

ప్లెక్సీ తొలగింపునకు ప్రేరేపించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 12 : సుభాష్ నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్ లో పెద్దమ్మ పోచమ్మ తల్లి 20వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసుకున్న బీఆర్ఎస్ బ్యానర్లను కాలనీ ఎంట్రన్స్‌లో ఈ నెల 9 ఆదివారం 11:30 (అర్ధరాత్రి) నుంచి 12 గంటల మధ్యలో ఆటోల్లో వచ్చి చాకులతో బ్లేడ్లతో తొలగించేందుకు ప్రేరేపించిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ.. బుధవారం బీఆర్ఎస్ శ్రేణులు జీడిమెట్ల సీఐ మల్లేశ్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, పి.వి. భాస్కర్ రెడ్డి, ఎస్సార్ నాయక్ నగర్ కాలనీ వైస్ ప్రెసిడెంట్ హరిబాబు యాదవ్ ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలు కోసిన వారిని అలాగే ప్రేరేపించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని మరోసారి ఏ పార్టీ ఫ్లెక్సీలపై చెయ్యి వేయకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జీడిమెట్ల సీఐని కోరారు. స్పందించిన సీఐ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సీఐ మల్లేశ్ కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు